

## సామాన్యుడి రాజకీయ ప్రస్థానం

విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. కృష్ణచైతన్య దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. నేహా శెట్టి కథానాయిక. ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం హైదరాబాద్‌లో దేవి థియేటర్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. 1980 దశకం గోదావరి ప్రాంతం నేపథ్యంలో కథను చూపించారు. ఇందులో లంకలరత్న అనే గ్రామీణ రాజకీయ యువకుడి పాత్రలో విశ్వక్‌సేన్ కనిపించారు. ఓ సామాన్యుడి అసమాన ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ ట్రైలర్ ఆసక్తిని పంచింది. పోరాట ఘట్టాలు రోమాంచితంగా సాగాయి. విశ్వక్‌సేన్ పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. గ్రామీణ రాజకీయాలు, ఆధిపత్య పోరాటం నేపథ్యంలో ట్రైలర్ ఆసాంతం ఉత్కంఠగా సాగింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: అనిత్ మాదాడి, సంగీతం: యువన్‌శంకర్ రాజా, సమర్పణ: శ్రీకర స్టూడియోస్.



## ఫొటోలు తీయొద్దంటే వినరే!

ఫొటోల గురించీ, ఫొటోగ్రాఫర్ల గురించీ ఆసక్తికరంగా మాట్లాడింది అందాలభామ జాన్వీకపూర్. ఆమె తాజా సినిమా 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫొటోగ్రాఫర్ల గురించి మాట్లాడింది జాన్వీ. 'ఫొటోలు మాకు అవసరం. ఎప్పటికప్పుడు న్యూలుక్స్‌తో అభిమానులకు కనిపించడం మాకు ఆనందం కూడా. అందుకే ఫొటోగ్రాఫర్లకు కోపరేట్ చేస్తుంటాం. వారు కెమెరాలను క్లిక్ మనిపించగానే, మేం స్టిల్స్ ఇచ్చేస్తుంటాం. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం పాతికసార్లు విమాన ప్రయాణం చేశా. నేను ఎయిర్‌పోర్ట్‌కు రాగానే మన ఫొటోగ్రాఫర్లంతా కెమెరాలతో రెడీగా ఉంటారు. దాదాపు ఓ పదినిమిషాల పాటు కెమెరా సౌండ్స్ ఆ పరిసరాలు మోతెక్కిపోతాయి. అలాగే మాకోసం ఫొటోగ్రాఫర్లు ఎదురుచూసే మరో ప్లేస్ జిమ్. మేం జిమ్ చేసి బయటకు రాగానే ఫొటోలు తీసేస్తుంటారు. ఆ టైమ్‌లో ఫొటోలు తీయొద్దని ఎంత వేడుకున్నా వినరు. జిమ్ టైమ్‌లో బిగుతుగా ఉండే దుస్తులు వేసుకుంటాం. వీళ్ల వల్ల అవి వైరల్ అవుతాయి. అది చాలా ఇబ్బందిగా ఉంటుంది' అంటూ చెప్పుకొచ్చింది జాన్వీ.



## ఇలాంటి కాన్సెప్ట్ ఇంతవరకూ రాలేదు

'ఇది హారర్ కాదు.. దెయ్యాన్ని చూసి భయపడటం అంత కన్నా కాదు.. ప్రేమించడం.. ఇలాంటి కాన్సెప్ట్‌తో ఇంతవరకూ సినిమా రాలేదు. అందుకే ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు' అన్నారు యువహీరో ఆశిష్. ఆయన కథానాయకుడిగా నటించిన సినిమా 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అనేది ఉపశీర్షిక. వైష్ణవి చైతన్య కథానాయిక. అరుణ్ భీమవరపు దర్శకుడు. హర్షిత్‌రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మాతలు. శనివారం విడుదలైన ఈ సినిమా సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుడు మాట్లాడుతూ 'ఇది స్లో పాయిజన్ లాంటి సినిమా. మెల్లిమెల్లిగా ఎక్కేస్తుంది. జనాలు బాగా ఎంజాయ్ చేస్తున్నారు' అని చెప్పారు. ఏ ట్విస్ట్‌కి ఎలా రియాక్ట్ అవుతారని అనుకున్నామో.. ఆడియన్స్ అలానే రియాక్ట్ అవుతున్నారని వైష్ణవి చైతన్య అన్నారు. ప్రేక్షకుల స్పందనపై నిర్మాతలు ఆనందం వెలిబుచ్చారు.



## అనుబంధాల సమ్మోహనం 'మనమే'

శర్వానంద్ 'మనమే' సినిమా జూన్ 7న విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఇటీవలే విడుదల చేసిన తొలి పాట పెద్ద హిట్ అయింది. తాజాగా శనివారం రెండో పాటను కూడా మేకర్స్ విడుదల చేశారు. 'మనమే..' అంటూ సాగే ఈ టైటిల్ సాంగ్‌ని కృష్ణకాంత్ రాయగా, హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరిచారు. కార్తీక్, గీతా మాధురి ఆలపించారు. విజయ్ పోలాకి కొరియోగ్రఫీలో శర్వానంద్ వేసిన స్టెప్స్ ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తాయని, కథానాయిక కృతిశెట్టి కూడా చాలా అందంగా ఉంటుందని వారు తెలిపారు. శర్వా, కృతి శెట్టి కెమిస్ట్రీతోపాటు, బాలనటుడు విక్రమాదిత్యతో వారి బంధాన్ని కూడా ఈ పాట ఆవిష్కరించిందని వారు అన్నారు. పీపుల్ మీడియా పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రానికి శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మాటలు: అర్జున్ కార్తిక్, ఠాగూర్, వెంకీ, కెమెరా: విష్ణుశర్మ, జ్ఞానశేఖర్.

## ప్రేమకు సరైన నిర్వచనం

స్వయంవరం, నువ్వేకావాలి, నువ్వునాకు నచ్చావ్, మన్మథుడు, మల్లీశ్వరి.. ఈ సినిమాలు దర్శకుడిగా కె.విజయభాస్కర్ ఏంటో చెప్పాయి. కొంత విరామం తర్వాత మళ్లీ ఓ ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు శ్రీకారం చుట్టారు కె.విజయభాస్కర్. సినిమా పేరు 'ఉషాపరిణయం'. తన తనయుడు శ్రీకమల్‌ని హీరోగా పరిచయం చేస్తూ స్వీయ దర్శకత్వంలో విజయభాస్కర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాన్వీ ఆకాంక్ష అనే తెలుగమ్మాయి ఇందులో కథానాయిక. శనివారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. 'ప్రేమకు సరైన నిర్వచనం చెప్పే సినిమా ఇది. ప్రేమికులకు ఫుల్‌మీల్స్‌లా ఉంటుంది. అన్ని ఎమోషన్స్ ఇందులో ఉంటాయి. సాంకేతికంగా సినిమా నెక్ట్స్ లెవల్లో ఉంటుంది. ముఖ్యంగా సంగీత దర్శకుడు ధృవన్ విశ్వరూపాన్ని ఇందులో చూస్తారు. నా కుమార్తె శ్యామల హీరోహీరోయిన్లకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేయడమే కాక, ప్రొడక్షన్ విషయం ఎంతో హెల్ప్ చేసింది. ఇక కమల్ ఇందులోని హీరో పాత్రకు వందశాతం న్యాయం చేశాడు' అని చెప్పారు కె.విజయభాస్కర్. ఇంకా హీరోహీరోయిన్లతో పాటు చిత్రబృందం కూడా మాట్లాడారు. అలీ, వెన్నెలకిశోర్, సూర్య, రవి, శివతేజ, శివాజీరాజా తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సతీశ్ ముత్యాల.





## కామన్‌మ్యాన్ కథ

'ఎలాంటి సినిమాలు చేయాలనుకున్నానో.. ఎలాంటి ఎమోషన్లు నా సినిమాలో ఉండాలని కోరుకున్నానో.. ఎలాంటి కేరక్టర్ పోషించాలని ఆశించానో అవన్నీ వందశాతం కుదిరిన సినిమా 'భజే వాయువేగం' అని హీరో కార్తికేయ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన ఈ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌కు ఐశ్వర్య మీనన్ కథానాయిక. ప్రశాంత్‌రెడ్డి దర్శకుడు. యూవీ కాన్సెప్ట్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ను హైదరాబాద్ ఐమాక్స్‌లో ఘనంగా విడుదల చేశారు. కార్తికేయ ఇంకా మాట్లాడుతూ 'కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఈ కథలో సహజంగా కుదిరాయి. చూస్తున్న వారు కథలో లీనమైపోతారు. మేమింత కాన్ఫిడెంట్‌గా ఉన్నామంటే కారణం దర్శకుడు ప్రశాంత్. మా టీమ్‌కు వెలకట్టలేని సంతృప్తినిచ్చిన సినిమా ఇది' అని చెప్పారు. ఇదొక ఎమోషనల్ థ్రిల్లర్ అని, పోస్ట్‌ప్రొడక్షన్‌కి ఎక్కువ సమయం తీసుకున్నామని, ఆ ఎక్స్‌పీరియన్స్ మీకు తెరపై తెలుస్తుందని, అసాధారణ సమస్యలో ఇరుక్కున్న ఓ కామన్‌మ్యాన్ అందులోనుంచి ఎలా బయటపడ్డాడు? అనే ప్రశ్నకు సమాధానమే ఈ సినిమా అని దర్శకుడు పేర్కొన్నారు. కథానాయిక ఐశ్వర్యమీనన్‌తో పాటు చిత్ర బృందం అంతా మాట్లాడారు. ఈ చిత్రానికి మాటలు: మధు శ్రీనివాస్, కెమెరా: ఆర్.డి.రాజశేఖర్.

## కేన్స్‌లో భారతీయ నటి సంచలనం

**ఉత్తమ నటిగా అనసూయ సేన్‌గుప్తా**



ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కోల్‌కతాకు చెందిన అనసూయ సేన్ గుప్తా ఉత్తమ నటిగా పురస్కారాన్ని గెలుపొంది సంచలనం సృష్టించింది. 'ది షేమ్‌లెస్' చిత్రానికిగాను ఆమె ఈ అవార్డు అందుకుంది. ప్రతిష్టాత్మక కేన్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో బెస్ట్ యాక్ట్రెస్ అవార్డు అందుకున్న తొలి భారతీయ మహిళగా అనసూయ రికార్డు సృష్టించింది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ముఖ్యమైన 'అన్‌సర్టెయిన్ రిగార్డ్' విభాగంలో ఆమె ఈ పురస్కారాన్ని దక్కించుకుంది. 'ది షేమ్‌లెస్' చిత్రాన్ని బల్గేరియన్ దర్శకుడు కాన్‌స్టాంటిన్ బొజనోవ్ తెరకెక్కించాడు. ఈ సినిమాలో రేణుక అనే వేశ్య పాత్రలో నటించింది అనసూయ. ఓ పోలీసును చంపి ఢిల్లీ వేశ్య వాటిక నుంచి పారిపోయిన రేణుక సెక్స్ వర్కర్ల కమ్యూనిటీలో ఆశ్రయం పొందుతుంది. అక్కడ పరిచయమైన ఓ అమ్మాయితో ఆమె ప్రయాణం ఎలా సాగిందన్నదే ఈ చిత్ర కథ. అనసూయ సేన్‌గుప్తాకు అవార్డు రావడం పట్ల పలువురు భారతీయ నటులు ఆనందం వ్యక్తం చేశారు.



## నా ఐడియాను కాపీ కొట్టారు!

తన కథను కాపీకొట్టి దర్శకుడు సాయిరాజేష్ 'బేబీ' సినిమా తీశాడని, ఆయన చేసిన మోసం..దానికి సంబంధించిన సాక్ష్యాలను బేబీ లీక్స్ పేరుతో పుస్తకరూపంలో తీసుకొచ్చానని చెప్పారు శిరిన్ శ్రీరామ్. ఆయన దర్శకత్వం వహించిన 'ప్రేమించొద్దు' చిత్రం జూన్ 7న విడుదలకానుంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో 'బేబీ' సినిమా విషయంలో తనను సాయిరాజేష్ మోసం చేశాడని శిరిన్ శ్రీరామ్ ఆరోపించాడు. ఆయన మాట్లాడుతూ 'ఫేస్‌బుక్‌లో చూసిన ఓ పోస్ట్ ఆధారంగా ఈ కథ రాసుకున్నా. ఆదే సమయంలో నిర్మాత సాయిరాజేష్‌తో ఏడాది పాటు ప్రయాణం చేశాను. నాకు దర్శకుడిగా అవకాశమిస్తూ తనే నిర్మాతగా సినిమా తీస్తానని సాయిరాజేష్ నాతో చెప్పాడు. సినిమా ఆలస్యం అవుతుందని అనిపించడంతో నేను బయటకు వచ్చేశాను. అదే కథను కాపీ కొట్టి 'బేబీ' తీశాడు. సినిమా రిలీజ్ సమయంలో నేను ఎలాంటి గొడవ చేయలేదు. నిజాలు తెలుసుకోవడానికి నాకు సమయం పట్టింది. సాక్ష్యాలను సేకరించి కాపీరైట్ లీగల్ నోటీసులు పంపాం. కానీ నాకే ఆయన ఈ కథ చెప్పాడని నోటీసులకు రిప్లై ఇచ్చారు. ఈ విషయంపై ఫిబ్రవరిలో రాయదుర్గంలో కేసు పెట్టాను. సాయిరాజేష్ మీద రాసిన 'బేబీ' లీక్స్ పుస్తకాన్ని మీడియా ముందుకు తీసుకొస్తున్నా' అన్నారు.





